www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

SIDDIPET POWER
TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి: 01 | సంచిక: 31 | హైదరాబాద్ | ఆదివారం | 20-04-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## ఢిల్లీని చూసి గుణపాఠం నేర్చుకోవాలి

- మూసీ ప్రక్షాళనపై రేవంత్ వ్యాఖ్యలు
- ప్రపంచంతో పోటీ పడేలా అభివృద్ధి

**సిద్దిపేట పవర్,, తెలంగాణ బ్యూరో**: తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడేలా అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్‌ఫ్రంట్‌ను పరిశీలించామని.. మూసీ నది ప్రక్షాళనకు కొంత మంది అడ్డుపడుతున్నారని రేవంత్ తెలిపారు. దిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని తెలిపారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా



రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్ తెలిపారు.

## బీజేపీకి కేటీఆర్ కట్టు బానిస

- బీజేపీపై బీఆర్ఎస్ ప్రేమతోనే HCU పై రెండు పార్టీ నేతల దుష్ప్రచారం
- సంఖ్యా బలం లేని బీజేపీ మీ పార్టీ అండ చూసుకొని పోటీ చేస్తోంది : మహేష్ గౌడ్

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

కేటీఆర్‌కి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్న మీరు అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నారని, పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పని చేసిన మీరు, మీ అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోడీకి దాసోహమయ్యారని ఆయన మండిపడ్డారు. మీ బలహీనతలను ఆసరాగా తీసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందని మహేష్ గౌడ్ ఆరోపించారు. సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేసిన మీరు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశ పెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది మీరు కాదా కేటీఆర్ అని ఆయన ఆయన ధ్వజమెత్తారు. పదేళ్లలో మోడీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదమని, కవితని లిక్కర్ స్కాం నుంచి కాపాడడానికి బీజేపీ కి ఊడిగం చేసిది నిజం కాదా? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు.



## వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలను

# బహిష్కరిస్తున్నాం..

### హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు..

### బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎవరికీ ఓటు వేయొద్దని ఆదేశాలు..

### ఎవరైనా విప్ ధిక్కరించి ఓటింగ్ కు వెళ్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తాం: కేటీఆర్

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

గ్రేటర్ హైదరాబాద్ లోని పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో ఏ ఎన్నికలు జరిగినా మనమే గెలిచే వాళ్ళం.. మొన్న 2023లో కూడా ఔటర్ రింగ్ రోడ్ లోపల అన్ని స్థానాలు మనమే గెలిచాం.. హైదరాబాద్ వాళ్ళు అభివృద్ధి కోరుకున్నారు కాబట్టి మనల్ని గెలిపించారు.. ఔటర్ అవతల ఉన్న వాళ్లు కాంగ్రెస్ మాటలకు మోసపోయారు అని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకం చేస్తుంది.. హైడ్రాతో పేదలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు.. ఆరు గ్యారెంటీలకు డబ్బులు లేవు అంటూనే.. మూసి సుందరీకరణ చేస్తాను అంటున్నారు.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తుఫాను వాతావరణంలో బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. ఇక, సందట్లో సడెమియా లాగా బీజేపీ వాళ్ళు ఉన్నారు అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, కేంద్రంలో ఒక సహాయ మంత్రి, మరో నిస్సహాయ మంత్రి ఉండి ఎలాంటి లాభం లేదు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కంచె గచ్చిబౌలి భూముల వెనుక బీజేపీ ఎంపీ ఉన్నాడంటే.. అందరూ ఎంపీలు భుజాలు



తడుముకుంటున్నారు.. బయటకు వచ్చి బీజేపీ ఎంపీలు నన్ను తిడుతున్నారు.. సోనియా, రాహుల్ గాంధీల మీద చార్జ్ షీట్ వేస్తే దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ వాళ్ళు ఆందోళన చేశారు.. కానీ, రేవంత్ రెడ్డి మాత్రం మాట్లాడలేదు.. బీజేపీ, నరేంద్రమోడీతో చోట భాయ్ బడా భాయ్ బంధం ఉంది కాబట్టే రేవంత్ మాట్లాడడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ లో పాల్గొనే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయొద్దు అన్నారు. ఆ రోజు ఎన్నికల్లో పాల్గొనవద్దు.. ఎవరూ ఓటుకు వెళ్లకుండా విప్ కూడా ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు ఎవరూ ఓటు వేయడానికి వెళ్లొద్దని సూచించారు. ఎవరైనా విప్ ధిక్కరించి ఓటింగ్ కు వెళితే వారిపై చర్యలు తీసుకుంటాం.. ఓటు ఉన్న వాళ్లకు విప్ ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డిలను కేటీఆర్ కోరారు.

## కాంగ్రెస్ పార్టీ సూచన మేరకే ఎంఐఎం సభ

### నక్సలైట్ల వారసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

### ప్రజాస్వామ్యంలో ఉంటూ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటారా?

### హిందూ సమాజమంతా రగలిపోతోంది : బండి సంజయ్

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ దూరంగా ఉండాలని బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయంతోపాటు ఎన్నికల్లో పోటీ చేయని కాంగ్రెస్ పైనా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు దూరంగా ఉండేది, ఓటింగ్ ను బహిష్కరించేది నక్సలైట్లు మాత్రమేనని అన్నారు. ఆ నక్సలైట్ల వారసులే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలని మండిపడ్డారు. అలాంటి పార్టీలను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విప్ లకు భయపడి ఓటింగ్ కు దూరంగా ఉన్నా, మజ్లిస్ పార్టీని గెలిపించినా ఆయా పార్టీల కార్పొరేటర్ల రాజకీయ భవిష్యత్తు ఖతం కాబోతోందని హెచ్చరించారు. తెలంగాణలోని 85 శాతం హిందువులంతా తీవ్రమైన ఆగ్రహంతో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. విప్ లకు భయపడి నిర్ణయం తీసుకుంటారో, ఓటింగ్ కు హాజరై మజ్లిస్ ను ఓడిస్తారో తేల్చుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు సూచించారు. హైదరాబాద్ బర్కత్ పురాలోని బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యాలయంలో నగర కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో బండి సంజయ్ సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షలు చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గౌతమ్ రావు, రాంచంద్రరావు, లంకల దీపక్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, గుండగోని భరత్ గౌడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు సంజయ్ దిశానిర్దేశం చేశారు.



## ఈ నెల 22న తెలంగాణ ఇంటర్ ఫలితాలు

- విడుదల చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి



**సిద్దిపేట పవర్,, తెలంగాణ బ్యూరో**: తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈనెల 22న విడుదల కానున్నాయి. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను ఒకేసారి ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 22 మధ్యాహ్నం 12 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tsbie.cgg.gov.in లేదా results.cgg.gov.inలో రిజల్ట్స్ చూసుకోవచ్చు. కాగా.. మార్చి 5 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,532 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 4.88 లక్షల మంది ఫస్టియర్ విద్యార్థులు ఉండగా, 5 లక్షలకుపైగా సెకండియర్ విద్యార్థులు ఉన్నారు. మార్చి 18 నుంచి సమాధాన

## జపాన్‌లో ఉద్యోగ అవకాశాలకు తెలంగాణ యువతకు వేదిక..

### జపాన్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు చేసిన TOMCOM

### ఒప్పందాల ద్వారా 500 అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు

### తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలకు దారితీసే ముందడుగు



**సిద్దిపేట పవర్,, తెలంగాణ బ్యూరో**: తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) రెండు ప్రముఖ జపాన్ సంస్థలతో కీలక ఒప్పందాలపై సంతకాలు చేసింది. టోక్యోలో అధికారిక పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సమక్షంలో, TERN (TGUK Technologies Pvt. Ltd.) , రాజ్ గ్రూప్ సంస్థలతో ఈ ఒప్పందాలపై TOMCOM అధికారికంగా సంతకాలు చేసింది.

ఈ ఒప్పందాల ద్వారా జపాన్‌లో పెరుగుతున్న ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ నుండి నైపుణ్యం గల యువతిని నియమించేందుకు వీలవుతుంది. ఒప్పందాల ప్రకారం రాబోయే 12 సంవత్సరాలలో సుమారు 500 ఉద్యోగాల అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. వాటిలో.. హెల్త్‌కేర్ (కేర్‌గివింగ్) - 200 ఉద్యోగాలు.. ఇంజినీరింగ్ (ఆటోమొబైల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్/ఐటీ) - 100 ఉద్యోగాలు.. హాస్పిటాలిటీ - 100 ఉద్యోగాలు.. కన్స్ట్రక్షన్ (సివిల్, బిల్డింగ్, మెంటెనెన్స్ తదితరాలు) - 100 ఉద్యోగాలు ఉన్నాయి. ఈ ఒప్పందాలు తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందించడంలో కీలక మైలురాయిగా నిలవనున్నాయి. ఇది తెలంగాణను ప్రపంచ నైపుణ్య ఉన్నత కేంద్రంగా మారుస్తూ, యువతకు విజయవంతమైన భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటుంది.

## ఆ పోస్ట్‌ను 2వేల మంది రీట్వీట్ చేశారు.. వాళ్లందరిపై చర్య తీసుకుంటున్నారా..?

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం తీరును ప్రతిపక్ష పార్టీలు సహా పలువురు ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు ఎండగడుతున్నారు. ఈ వ్యవహారంలో తెలంగాణ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ (Smita Sabharwal)కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు పంపిన నోటీసులపై స్మితా సబర్వాల్ తాజాగా స్పందించారు.

గచ్చిబౌలి పోలీసులకు తాను పూర్తిగా సహకరించినట్లు చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ఆ పోస్టును తాను రీపోస్టు చేసినట్లే 2 వేల మంది షేర్



చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా..? చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత కోరినట్లు స్మితా సబర్వాల్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



## తెలంగాణలో 5 రోజులు

# భారీ వర్షాలు

- 16 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
- ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం

**సిద్దిపేట పవర్,, తెలంగాణ బ్యూరో**: తెలంగాణలో రానున్న 5 రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. హైదరాాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ద్రోణి కారణంగా ఇవాళ్టి నుంచి వచ్చే 5 రోజులు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. ముఖ్యంగా 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో వర్షాలు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, పలుచోట్ల వడగండ్లు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే, వర్షాలు పడినా రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొంది.

## జేఈఈ మెయిన్‌లో సత్తాచాటిన

# తెలుగు తేజాలు



**సిద్దిపేట పవర్,, తెలంగాణ బ్యూరో:**

**జేఈఈ మెయిన్‌లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం అర్ధరాత్రి విడుదల చేసింది. నలుగురు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి మనోజ్ఞ గుత్తికొండ, తెలంగాణకు చెందిన హర్ష్ ఎ. గుప్తా, వంగల అజరురెడ్డి, బనిబ్రత మజీ 100 పర్సంటైల్ సాధించారు. అలాగే టాప్-100 ర్యాంకుల్లో 15 మంది తెలుగు విద్యార్థులు ఉన్నారు. 99 పర్సంటైల్‌లో వంద మందికిపైగా చోటు సాధించారు. రాజస్తాన్‌కు చెందిన ఎండీ అనాస్, ఆయుష్ సింగల్ తొలి రెండు ర్యాంకులు సాధించారు.**



## ఉపాధి హామీ కూలీగా మాజీ సర్పంచ్ విజయ

**సిద్దిపేట పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కొండ్రెడ్డిచెరువు తాజా మాజీ సర్పంచ్ చెరుకు విజయాకనకయ్య శనివారం ఉపాధి హామీ పథకంలో కూలీగా పనుల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొండ్రెడ్డిచెరువును నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయగా గ్రామస్తులు విజయను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.గ్రామాభివృద్ధి కోసం వెచ్చించిన రూ. 18 లక్షలు బకాయి ఉన్నట్టు విజయ తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టడానికి అప్పులు చేసి మరి ఖర్చు చేశామని ఈ సందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో కుటుంబ నిర్వహణ కోసం తాను తప్పనిసరై ఉపాధి హామీ పనులకు వెళ్లాల్సిన వస్తుందని తెలిపారు.

### చిన్నారి స్పీచ్‌తో కంటతడి పెట్టిన

## మాజీ మంత్రి హరీష్ రావు..

**సిద్దిపేట పవర్:** ఢిల్లీకి రాజు అయిన తల్లికి కొడుకే అనే సామెత మనం తరచుగా వింటుంటాం.. అమ్మా.. నాన్నా ప్రేమ, ఆప్యాయత, అనుబంధం అందరికీ ఒక్కటే.. వీటి గురించి విన్నా.. కళ్లారా చూసినా.. చాలా మంది భావోద్వేగానికి లోనవుతారు.. అచ్చం అలాంటి సందర్భమే సిద్దిపేటలో కనిపించింది. మాజీ మంత్రి హరీష్ రావు నిత్యం ప్రజలను, యువకులను, విద్యార్థులను.. కాలానికి, పరిస్థితులకు అనుకూలంగా పలు సూచనలు చేస్తూ ముందుకు తీసుకెళ్తుంటారు. అయితే.. విద్యార్థులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీష్ రావు కన్నీళ్లు పెట్టారు.విద్యార్థులు భవిష్యత్తులో ముందుకెళ్లడానికి, ఉన్నతంగా ఎదగడానికి ప్రోత్సాహాన్ని అందించేలా.. భద్రంగా ఉండాలి.. భవిష్యత్తులో ఎదగాలి.. అనే కార్యక్రమాన్ని సిద్దిపేటలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని తన పరిస్థితుల గురించి వివరించింది.. తాను



రెండవ తరగతిలో ఉన్నప్పుడే తన తండ్రి చనిపోయాడని.. తన తల్లి కష్టపడి స్కూల్ ఫీజు కడుతుంది అంటూ.. విద్యార్థిని కంటతడి పెట్టింది.. ఆ దృశ్యాన్ని చూసిన హరీష్ రావు హృదయం చలించిపోయింది. ఆ చిన్న పాపను ఓదార్చి నేనున్నానంటూ భరోసా ఇస్తూ,హరీష్ రావు కూడా కంటతడి పెట్టారు.. అది చూసిన చాలామంది చలించి పోయారు.



## రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**సిద్దిపేట పవర్:** రైతుల సంక్షేమం కోసం పని చేస్తు సకల వసతులు కల్పిస్తున్నది కేవలం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని పెద్దపల్లి, అప్పన్నపేట సింగిల్ విండో పరిధిలోని నిట్టూరు, నిమ్మనపల్లి, తుర్కలమద్దికుంట, కాసులపల్లి, పాలితం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సన్నవడ్లకు భోనస్ , రుణమాఫీ, రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం లాంటి పథకాలతో అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప సురేందర్, సింగిల్ విండో చైర్మన్ లు మాదిరెడ్డి నర్సింహారెడ్డి చింతపండు సంపత్, సీఈవోలు మెట్టు మదన్ మోహన్, గడ్డి తిరుపతి, మార్కెట్ వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారి కాంతాల అలివేణి, మాజీ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, మండల అధ్యక్షుడు ఏడెల్లి శంకరయ్య , ఎనగందుల ప్రదీప్, నూగిళ్ల మల్లయ్య, ఐకేపి సీఏ అనాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్ కార్మికుల పింఛన్ పెంచాలి

**సిద్దిపేట పవర్:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సింగరేణి సంస్థ రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ రూ .10వేలకు పెంచాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఖాయిలా శాఖ కార్యదర్శి సీఎంపీఎఫ్‌వో బోర్డు ఆఫ్ ట్రస్టీస్ చైర్మన్ విక్రమ్ దేవ్ దత్ కు శనివారం లేఖ రాశారు .1989లో తన వెంకటస్వామి ప్రవేశపెట్టిన పింఛన్ పథకం ఇప్పటివరకు సవరించకపోవడం వల్ల పదవీ విరమణ కార్మికులు నెలకు సగటుగా ₹1,500 మాత్రమే పొందుతున్నారని, ఇది నేటి జీవన ఖర్చులకు తగినంత కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు సమీక్ష నిర్వహించి సింగరేణి కార్మికులకు తగిన న్యాయం చేకూర్చాలని ఎంపీ వంశీ కోరారు.



### బీఆర్ఎస్ రజతోత్సవ సభను

## విజయవంతం చేయాలి

**సిద్దిపేట పవర్:** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలాధ్యక్షుడు నల్లా భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో పార్టీ రజితోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ శ్రేణులు సైనికుల్లా కదిలి రావాలని కోరారు. ఈ నెల 27న గ్రామ గ్రామాన పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం ర్యాలీగా కార్యకర్తలు, పార్టీ అభిమానులు మండల కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు అఫ్జల్, నాయకులు ఏడుకొండలు, పందిరి వీరయ్య, వెంకటప్పయ్య, వెంకటేశ్వర్లు, భూక్యా బోసు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చార్లెస్ పాల్గొన్నారు.

### కేసీఆర్ గ్రామీణ ప్రజల దీన గాథలను చూసి

## కల్యాణలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారు

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సిద్దిపేట పవర్:** కొండాపూర్ మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఇవాళ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ అంతటా తిరిగి.. తాను స్వయంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల దీన గాథలను చూసి చలించి పోయి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్నో పేద ప్రజల పెళ్లిలు చేసి వారి కుటుంబాలకు పెద్ద కొడుకుగా నిలిచారన్నారు. కొండాపూర్ మండలానికి 40 కల్యాణ లక్ష్మీ, 14 షాదీముబారక్.. మొత్తం 54 చెక్కులను పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు మల్లాగౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మ్యాకం విఠల్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుక్మోద్దీన్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు రాంచంద్రయ్య, అంజీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగయ్య, ఇంద్రారెడ్డి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## మియాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

**సిద్దిపేట పవర్:** హైదరాబాద్‌లోని మియాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. వరల్డ్ వన్ స్కూల్ వెనుక ఉన్న భారీ షెడ్లను జేసీబీలతో కూల్చివేశారు. పోలీసుల బందోబస్తు మధ్య ఈ కార్యక్రమం చేపట్టారు. తుర్కయాంజల్ పరిధి కమ్మగూడలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. స్థానికుల ఫిర్యాదుతో సర్వే నంబర్ 213, 214లో అడ్డుగా ఉన్న గోడను అధికారులు కూల్చివేశారు. కాలనీలకు వెళ్లకుండా అడ్డుగా గోడ నిర్మించారని స్థానికులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు.



## మహిళలు జాగ్రత్తలు వహించాలి..

- అగ్నిప్రమాదాలపై అవగాహనలో సిబ్బంది

**సిద్దిపేట పవర్:** ప్రమాదాలు జరగడంతోనే వాటికి నివారణ చర్యలను చేపట్టాలని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. ఇవాళ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు వీధులతోపాటు ప్రధాన కూడళ్లలో పట్టణ వాసులకు ప్రమాదాలపై సూచనలు చేశారు.ముఖ్యంగా మహిళలు ఎక్కువ శాతం ప్రతీ రోజు వంటలు చేస్తుంటారని.. ఆ సమయంలో చాలా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి ఆందోళన చెందకుండా పటిష్టమైన చర్యలను చేపట్టాలన్నారు. దవాఖానాల్లో వైద్యులు ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.పేషంట్ ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు వెంటనే తగిన జాగ్రత్తలను వహించాలన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్రయాణికులకు ప్రమాదాలపై సమగ్రవంతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శకట సిబ్బంది అన్నారు.





## భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అందరూ ఆచరించాలి

**సిద్దిపేట పవర్:**
భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం ఎంతో శ్రేష్ఠమైనవని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, అందే గ్రామంలోని శివాలయంలో బాణలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఆచార వ్యవహారాలతోపాటు ధర్మబద్ధమైన నియమాలతో జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రజతోత్సవ సభ సక్సెస్ కోసం.. ఉద్యమంలా

## బీఆర్ఎస్ నేతల వాల్ రైటింగ్

**సిద్దిపేట పవర్:** వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా బీఆర్ఎస్ నేతలు వాల్ రైటింఇవాళ రామాయంపేట పట్టణ శివారులోని గోడలపై వాల్‌రైటింగ్ రాస్తూ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నుండి పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లాలని కార్యకర్తలు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు.ఈ వాల్ రైటింగ్ కార్యక్రమంలో చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ సాగర్, నర్సింహులు, సాయి విజ్ఞాన్‌రెడ్డి, నాగ రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.గ్ కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగిస్తున్నారు.




## ముగ్గు పోయలే.. పునాదులు తవ్వలే..

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కానరాని ప్రగతి

**సిద్దిపేట పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో ఆశించిన ప్రగతి కానరావటం లేదు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్ళ నిర్మాణం చేపట్టాలంటూ అధికారులు ఆదేశించినా, ఇండ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ఎంపిక చేసిన వారిలో మూడో వంతు లబ్దిదారులకు కూడా ఇళ్ళ నిర్మాణాలకు మార్కింగ్ చేయకపోగా, చేసిన వారిలో 20 శాతం కూడా బేస్మెంట్ స్థాయికి చేరకపోవడం ఆందోళనకర పరిణామంగా మారింది. దీంతో, అధికారులు పైలెట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, లబ్దిదారులతో నిర్మాణపనులు మొదలు పెట్టించేందుకు ఆపసోపాలు పడుతున్నారు.పథకంలో భాగంగా నిలువనీడలేని నిరుపేదల కోసం ముందుగా డబ్బులిచ్చి ఇండ్ల నిర్మాణం చేపడుతామంటూ అనేక సభల్లో పదేపదే నొక్కివక్కానించిన అధికార నేతలు, లబ్దిదారుల ఎంపిక ప్రక్రియనే ప్రహసనంగా సాగించారు. ఏడాది అనంతరం మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, గ్రామంలోని లబ్దిదారులకు గృహాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో లబ్దిదారులకు మంజూరు పత్రాలు కూడా అందజేశారు. అయితే, వీరిలో అత్యధికమంది సొంతిల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ప్రదర్శించటం లేదు. ఓ వైపు మండుతున్న ఎండలు, మరోవైపు ఏరోజుకారోజు పెరుగుతున్న నిర్మాణ సామాగ్రి ధరలు, ఇంకోవైపు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు పడుతున్న వైనం వెరసి లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణాలపై దృష్టి సారించటం లేదని తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాలోని 15 మండలాలకు చెందిన ఎంపిక చేసిన 15 గ్రామాల్లో 2027 మందిని లబ్దిదారులుగా అధికారులు ప్రకటించారు.




WWW.SIDDIPETPOWER.COM